
# కాంతం కాపురం

శ్రీ రామారావు.



"కాంతం, పుస్తకం గూట్లోవుంది తెచ్చి పెడ్తావా?"

ఆమె పరుగెత్తి కెళ్ళింది.

కాంతం టెన్నిసు బంతిలా యెంతో చురుకైన పిల్ల. పన్నెండో యేడు జరుగుతోంది. అప్పుడప్పుడే ఆమె ముఖంలో యౌవ్వన శోభ ప్ర కా శి స్తుం ది. చెక్కిలప్పుడే యెఱ్ఱగా నునుపుదేరుతూన్నాయి.

నాచేతిలో పుస్తకం వుంచింది. పుస్తకం అందుకుంటూ నీలాల్లాంటి ఆమె సోగకన్నులవేపు పట్టిపట్టి చూచాను. ఆమె నవ్వుకుంది. "బావా, మరి నువ్వు సీమ యెప్పుడెళ్తావు?"

"ఇంకా తాతయ్య యేదీ నిశ్చయం; చేయలేదు; త్వరలోనే వెళ్తా."

ఆమె మాట్లాడలేదు. నా పుస్తకం తీసుకుని బైటికి వొచ్చేసేను.

నా ఇంగ్లండు ప్రయాణం నిశ్చయ మైపోయింది. సామానంతా సర్దుకున్నాను, బయల్దేరే వరకూ వుత్సాహంగానే వున్నది. కాని, త రు వా త చాలా దుఃఖం కలిగింది- యింతమందినీ వొధిలి పో వా లి కదాని. కా నేం జేయను? ఆర్ధిక పరిస్థితులు; చదువు తప్పదని తోచాయి.

కాలేజీలో జాయనయ్యాను. చాలామంది స్నేహితులు కూడారు. రెండేళ్ళు గడిచేటప్పటికి అంత కష్ట మనిపించలేదు. యిక్కడివన్నీ చాలా మట్టుకు మర్చిపోయేను 'సోఫీ' మాటల్లోనూ 'కాటన్' పరిహాసాలతోనూ కాలం గడిచిపోయేది.

ఒకనా డుత్తరం వొచ్చింది కాంతానికి పెళ్ళని! నాకాశ్చర్యమేసింది. కాని, నేనిక్కడుండి చేసేదేముంది? మా మేనత్తకి వొక్కర్తే కూతురు; అందుచేత అపురూపంగా త్వరగా పెండ్లిచేద్దామని పుట్టింది కామోసు!

తరువాత,- సంవత్సరానికి పిల్లకూడా పుట్టిందట! పిల్ల ఫోటో పంపమని వ్రాశాను. అంతా కాంతం పోలికే. ఆకళ్లూ, ఆ చెంపలూ అన్నీ అక్షరాలా ఆమె రూపాలే! మరి రెండేళ్ళలో నా పరీక్షలు అయాయి. నేను యింటికి వొచ్చేశేను.

కాంతాన్ని చూడాలనుకున్నాను. కాని, అత్త వారింటవుందట. అందుచేత చూడడానికి అవకాశం లేకపోయింది.

రాజమండ్రీలో ఆమె భర్తకి వుద్యోగమని చెప్పారు. పోనీ దగ్గరగదా వొకమారు వెళ్లి వొద్దామని వెళ్లాను. అరుగుమీద కాంతం కూతురు కామోసు ఆడుకుంటోంది. ఆ చెదరిపోయినతలా, మట్టితో వున్న గౌనూ. వుత్సాహాన్ని చాలమట్టుకు అణచేసేయి. లోపలికి వెళ్ళేసరికి కాంతం యేదో పనిలో వుంది. నన్ను ఆనవాలు పట్టలేకపోయింది. ఆమెతో కొత్తగా పరిచయం కలుగచేసునో వలసి వచ్చింది–యెంత సరదాతో కాంతాన్ని చూడాలని వొచ్చానో అంత వుత్సాహభంగం అయింది. ఆమె ముఖంలో కళ, కాంతులు లేతవర్చస్సు కరిగిపోయినట్టు అయిపోయింది. ముసల్దానిలా ఆమె నున్నలు చెంపలు గుంటలు పడి, యెంతో వికృతాకారంతో వుంది. ఆమెను చూసేసరికి జాలీ యేడుపు కూడా వొచ్చాయి. దౌర్భాగ్యపు హిందూసంఘంమీద రోత పుట్టింది. కలకల్లాడే శశిలా వుండవలసిన కాలంలో మూడు కాలాల ముసలిదానిలా వుంది! ఆమె పెళ్లి!—సంసారం గదా ఆమెనీ దుస్థితికి తీసుకొచ్చింది? పాడు సంఘపు కట్టుబాటుకులోనై చిన్నతనంలోనే పెండ్లి చేసి పిల్లలకు యౌవ్వన రక్తాన్ని వొలకబోసిన పెద్దలు పూజ్యులా?

సాయంత్రం ఆమె భర్త వొచ్చాడు. నాగరీకంగానే వున్నాడు. చాలా గౌరవంగానే మాట్లాడేడు. ఆమెకు ట్రీట్మెంటు చాలా అవుసరమని చెప్పాను. పాశ్చాత్య దేశపరిస్థితులు, మన దేశపరిస్థితులు ఆయనకి తెలిసేట్టు చెప్పాను. మనవాళ్లు బాల్యవివాహాలవల్లే పాడైపోతున్నారని ఆయన అంగీకరించాడు. అందుచేతనే వీరులైన భారతీయులు పిరికిపందలౌతున్నారు. మన దేశం, మనం బాగుపడాలాంటే బాల్య వివాహాలు మానేయాలి తరరాత వివాహపు కాలం పొగిడించాలి. అలా మన వేడి దేశంలో వీల్లేకపోతే జన్మశాసనం చేయటం చాలా అవుసరం. కాంతం స్థితిచూస్తె నాకెంతో దిగులు కలిగింది. నేను యింగ్లాండు వెళ్లక పూర్వం యెంతో అందంగా, నీటుగా, ఆకర్షణీయంగా, కలకల్లాడుతూ వుండేది. నేనెంతో ఆశపడ్డాను. ఆమెనేమన్న దేశానికి విరిగివొచ్చే సరికి యెంతో.........అని ఆ అమూల్యమైన యవ్వనదశ అంతా అదోదారి పాలైపోయింది. లేత వయసులోనే పిల్లను కని ఆమె ఆరోగ్యాన్ని పాడు చేసుకుంది. మీరు చదువుకున్నవారు. అంతగా చెప్ప నవుసరంలేదు. అయినా చెప్తూన్నాను. మీరు యికనుండైనా జన్మశాసనం చేయడం చాలా అవుసరం. మీ దాంపత్యం, ప్రేమ అభివృద్ధ పొందాలంటే అదేసాధనం. డాక్టర్ సలహా తీసుకోండి. ఛాందసులు పాప మంటారు నమ్మకండి. మనం అంతకంటే పాపమైనవీ, హేయమైనవీ పనులు చాలా చేస్తున్నాం. జీవంలేని, సత్తాలేని జనాభాని పొడిగించడం మాత్రం ధర్మమా?, పుణ్యమా?. మనం కాలమానాన్నిబట్టి మారిపోవాలి అంతేగాని పాపపుణ్యాలని చూస్తే పవిత్రమైన, సారవంతమైన భారత దేశాన్ని అధోగతికియీడ్చుకొస్తున్నాం. యీమాటలు కొత్తగా వింతగా వినిపించవచ్చు. కొన్ని సంవత్సరాలు యితర దేశాల్లో తిరిగి అనుభవం సంపాదించి మీకీ ముక్కలు చెప్తూన్నాను. నామాటలో విలువుంచండి.